క్లుప్తంగా

శాస్త్రీయ దృక్పథం అవసరం



సమావేశంలో పాల్గొన్న జేవీవీ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం లోపించడం వల్లే మూఢనమ్మకాలు ఇంకా కొనసాగుతున్నాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలరాజు అన్నారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో ఆదివారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, రాజకీయ పరిస్థితుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. సైన్స్, శాస్త్రీయ వైఖరి పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక సభ్యత్వం మరింత పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, జిల్లా కోశాధికారి అజీజ్, సైన్సు ప్రచార రాష్ట్ర కమిటీ సభ్యులు సాదత్ అలీ, జేవీవీ సభ్యులు మహేందర్, ప్రవీణ్, సుధాకర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నర్సింహులు



నియామక పత్రం అందుకున్న నర్సింహులు

తొగుట(దుబ్బాక): బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చందాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింహులు యాదవ్ నియామకమయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడతూ బీసీల హక్కుల కోసం పోరాడుతానన్నారు. కృష్ణయ్యకు, సహకరించిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

300 మందికి అన్నదానం



అన్నదాన వితరణ చేస్తున్న నవీన్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం వాసవీక్లబ్‌ల ఆధ్వర్యంలోమహాలయా అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం 300 మందికి అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్ మాట్లాడుతూ మహాలయ అమావాస్య దాన సేవా సమితి సహకారంతో ప్రతీ అమావాస్య నాడు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. దాతలు భాగస్వామ్యులై పితృ దేవతలను తృప్తిపర్చుకోవాలన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉప్పల పాండురంగం, శ్రీనివాస్, గంగిశెట్టి పాండురంగం, రాజ్‌కుమార్, ఉప్పల రాజు, వెంకటేశం, చంద్రమౌళి, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన నిరుపేద తాళ్ళపల్లి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో అఖిల రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కూకట్‌పల్లి ఎస్‌ఐ తౌడ సత్యనారాయణ ఆదివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట ఫౌండేషన్ సభ్యులు బండ చిన్న నర్సింహులు, కంకణాల చంద్రం, ఎడవేణి లక్ష్మణ్, బిట్ల భాస్కర్, ఇనుప రవి, రాళ్లబండి రవి తదితరులు ఉన్నారు.

సహాయ నిధి పేదలకు వరం



చెక్కులు అందిస్తున్న చందు

హుస్నాబాద్‌రూరల్: సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని ఏఎంసీ వైస్ చైర్మన్ బంక చందు అన్నారు. నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. మహ్మదాపూర్‌లో పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆదివారం ఆయన అందజేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సంప్రదిస్తే వైద్య సహాయం చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సంగ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ జాతర సందడి మొదలైంది. తెలంగాణ సంస్కృతికి, ఆచార వ్యవహారాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకల్లో మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు ఉదయం నుంచే తీరొక్క పూలను సేకరించి భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహించారు. మహిళలకు ప్రీతికరమైన ఈ వేడుకలు ఆదివారం వైభంగా ప్రారంభమయ్యాయి. రకరకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చారు. గ్రామాలు, పట్టణాల్లోని ముఖ్య కూడళ్లలో బతుకమ్మలను ఉంచి పాటలుపాడుతూ ఆనందంగా బతుకమ్మ ఆటలాడారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు.



కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

తెలంగాణ సంస్కృతికి దర్పణం..

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు పెట్టింది పేరుగా బతుకమ్మ వేడుకలు ఆదివారం శివాజీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మహిళల బతుకమ్మ ఆటలను తిలకించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంగలి పూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు 9 రోజులపాటు జరిగే ఈ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎంగిలి పూల బతుకమ్మ పండుగ సందర్భంగా వందలాదిగా మహిళలు ఆడిపాడి సందడి చేశారు. హనుమాన్ దేవాలయంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



బెజ్జంకి అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ



చిన్నకోడూరులో..



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి రామాలయం వద్ద



జగదేవ్‌పూర్(గజ్వేల్): బతుకమ్మను తీసుకెళ్తున్న చిన్నారులు



నంగునూరులో..



చేర్యాల(సిద్దిపేట): శ్రీనగర్‌కాలనీలో ..



హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో..



హుస్నాబాద్‌లో బతుకమ్మ ఆటలు



హుస్నాబాద్: బతుకమ్మలతో వస్తున్న మహిళలు



హుస్నాబాద్‌లో..

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

– ఎస్‌ఐ మానస

దుబ్బాకటౌన్: తాత్కాలిక ఆనందం కోసం గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని రాయపోల్ ఎస్‌ఐ కుంచం మానస పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నార్కోటిక్ డాగ్స్‌తో గంజాయి, ఇతర మత్తుపదార్థాల నివారణకు టీ కొట్టు, పాన్, కిరాణా షాపులు, అనుమానాస్పద ప్రాంతాలలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, ఎవరికైనా సమాచారం ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ సిబ్బంది అజయ్ కుమార్, శ్యాంసుందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



డాగ్ స్క్వాడ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మానస

ఐమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవం

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డులో ఆదివారం మున్సిపల్ చైర్మన్ మంజుల ఐమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం వార్డులో మహిళలతో కలసి బతుకమ్మ సంబురాలలో పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, కౌన్సిలర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ జీవితం స్ఫూర్తిదాయకం

హుస్నాబాద్: తెలంగాణ సాధనే ధ్యేయంగా కృషిచేసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ భక్త మార్కండేయ దేవాలయ ఆవరణలో ఆదివారం కొండా లక్ష్మణ్ 13వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని తెలంగాణ జాతిని సంఘటితం చేసిన నాయకుడు లక్ష్మణ్ బాపూజీ అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన లక్ష్మణ్ బాపూజీ విగ్రహ స్థాపన కోసం అందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణ, బూర్ల రాజయ్య, కోమటి సత్యనారాయణ, గాజుల భగవాన్, నాగభూషణం, లక్ష్మయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

గజ్వేల్‌లో ..

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, సంఘం సభ్యులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, రాజారాం, ప్రేమ్‌కుమార్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'కు అప్పగిస్తే అడ్డుకుంటాం

సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్

దుబ్బాక: వెల్ఫేర్‌బోర్డు స్కీమ్‌లను ప్రభుత్వం ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలకు అప్పగిస్తే తప్పనిసరిగా అడ్డుకోడానికి ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ హెచ్చరించారు. పట్టణంలో ఆదివారం బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ పోరాటాల ఫలితంగానే భవన నిర్మాణ కార్మికులకు వర్తించే బీమా పెంచిందని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు అలాగే సాధారణ మరణం చెందితే రూ.1.30 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచారన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ అధీనంలో ఉన్న వెల్ఫేర్‌బోర్డు ద్వారా ఈ స్కీమ్‌లు అందిచేవారని, ఇప్పుడు ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూడడం సరైందికాదని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపడతామని పిలుపునిచ్చారు. అనంతరం భవననిర్మాణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా మాడవైన నాగరాజు, కార్యదర్శిగా శెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నరేశ్, యాదమ్మ, బాలకిషన్, శ్యామల, సహాయ కార్యదర్శులుగా కాకి మల్లేశం, శ్రీనివాస్, రమేశ్, కోశాధికారిగా సొడు వెంకటస్వామిని నియమించారు.



మాట్లాడుతున్న భాస్కర్

సొంత నిధులతో మౌలిక వసతులు

- విఫలమైన అధికారులు
- నడుంబిగించిన స్థానికులు

చేర్యాల(సిద్దిపేట): గ్రామాలు, పట్టణాల్లో నివసించే ప్రజలకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలి. కానీ అందుకు భిన్నంగా మండల పరిధిలోని గ్రామాలు, పట్టణంలో మాత్రం ప్రజలే తమ సొంత ఖర్చులతో మౌలిక వసతులు కల్పించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండల పరిధిలోని కమలాయపల్లిలో కాలనీవాసులు రూ.1.20 లక్షలతో మురుగు కాలువ పైపులైన్ ఏర్పాటు చేసుకున్నారు. దానిపై ఏ అధికారి స్పందించలేదు. పట్టణ కేంద్రంలోని 4వ వార్డు పరిధిలోని సాయి కేపీఆర్ నగర్‌లో మిషన్ భగీరథ పైపులైన్ కోసం తీసిన గుంతలను సరిగా పూడ్చకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో కాలనీవాసులే తమ సొంత డబ్బులతో ఆదివారం మొరం పోయించి చదును చేయించుకున్నారు. సాయి కేపీఆర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరెళ్ళ వీరమల్లయ్య, ప్రధాన కార్యదర్శి గందె వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు కడుదూరి మహేందర్‌రెడ్డి, కోశాధికారి మల్లి పెద్ది రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ పనులు చేయించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చేర్యాల ప్రాంత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పనులు చేయిస్తున్న కాలనీ అసోసియేషన్ కమిటీ ప్రతినిధులు

ఉద్యోగులకు శాపం 'సీపీఎస్'

బెజ్జంకి(సిద్దిపేట): ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ శ్రీధర్ డిమాండ్ చేశారు. బెజ్జంకిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బలహీన వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నారోజు శంకరాచారి, ఉపాధ్యక్షుడిగా ఉండ్రాల్ల తిరుపతి, సతీశ్, శ్రీనివాస్, తిరుమలేశ్, నర్సయ్య, కార్యదర్శులుగా ఎం.రమేశ్, శేఖర్, శ్రీనివాస్, రాజు, చందు, ఆర్థిక కార్యదర్శిగా ఎండీ షాబొద్దిన్, జిల్లా కౌన్సిలర్లుగా వడ్లకొండ శ్రీనివాస్, రామంచ రవీందర్ ఎన్నికయ్యారు.

కేసీఆర్ కల సాకారం చేసిన హరీశ్‌రావు

బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేట ప్రాంతంలో పరిశ్రమ నెలకొల్పి యువతకు ఉపాధి, రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కేసీఆర్ కన్న కలలను ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు సాకారం చేశారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగం గౌడ్, మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య అన్నారు. నంగునూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నర్మేటలో నెలకొల్పిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం హరీశ్‌రావు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, మల్లయ్య, రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేందర్‌గౌడ్, వేణు, రామిరెడ్డి, రాజయ్య, నర్సింగారావు, మల్లయ్య, సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేతో లెక్క.. పక్కా

పంట నమోదుకు సర్వం సిద్ధం

- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఏఈఓలు
- ప్రభుత్వ సూచనల మేరకు నమోదు
- ప్రయోజనం పొందనున్న రైతులు

చేర్యాల(సిద్దిపేట): వానాకాలం సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలను పక్కాగా నమోదు చేసేందుకు ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు సిద్ధమయ్యారు. గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వేలో అధికారులు నిమగ్నమయ్యారు. మండలాల వారీగా తమతమ క్లస్టర్ పరిధిలో ప్రభుత్వ సూచనల మేరకు సర్వే నిర్వహించనున్నారు.

20 పంచాయతీలు.. 7 క్లస్టర్లు

మండల పరిధిలోని 20 పంచాయతీలకు ఏడు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్ కింద రెండు నుంచి మూడు పంచాయతీన్నాయి. ఈ ఏడు గ్రామాల్లో ఏడుగురు వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలించి ఆన్‌లైన్లో నమోదు చేస్తారు.

ప్రత్యేక మొబైల్ యాప్

గత ప్రభుత్వ హయాంలో మొదటగా గ్రామాల వారీగా పంట సాగు విస్తీర్ణ వివరాలను సేకరించి ఆ తర్వాత ట్యాబ్‌లో నమోదు చేసేవారు. ఈ సారి అందుకు భిన్నంగా ఏఈఓలు క్షేత్రస్థాయికి వెళ్లి పంట, సాగు విస్తీర్ణాన్ని పరిశీలించి యాప్‌లో నమోదు చేయనున్నారు.



ఆకునూరులో డిజిటల్ సర్వే చేస్తున్న ఏఈఓ పూజ

వివరాల సేకరణ ఇలా..

డిజిటల్ సర్వేలో భాగంగా క్లస్టర్ వారీగా ఏఈఓలకు సూచించిన గ్రామాల్లో రైతు పేరు, సర్వే నంబరు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్‌బుక్, ఫోన్ నెంబరుతోపాటు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలు నమోదు చేస్తారు. ఈ విధానంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా పంటల సాగు వివరాలు ఉండేలా పారదర్శకంగా పంట సర్వే చేయనున్నారు. మండల పరిధిలో సుమారు 34 వేల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, ఆయిల్‌పామ్ సాగు చేసినట్లు అధికారులు తెలిపారు.

రైతులకు చాలా ప్రయోజనం



ఈ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలు డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా నమోదు చేస్తున్నాం. మండల, పట్టణ పరిధిలోని ఏడు క్లస్టర్లలో ఆయా క్లస్టర్ ఏఈఓలు సర్వే చేస్తున్నారు. దీంతో రైతుకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేస్తున్న ఈ సర్వేలో రైతులు పాల్గొని వివరాలు పక్కాగా నమోదు చేసుకోవాలి. నిర్ణీత సమయంలోగా సర్వే పూర్తి చేస్తాం.

– పి.భోగేశ్వర్, ఏఓ, చేర్యాల